ఓజోన్ పరిరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.కిషోర్ కుమార్

శేరిలింగంపల్లి: భూమిపై ఉన్న సకల జీవరాసుల ప్రాణాలను కాపాడుతున్నదే ఓజోన్ పొర అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.కిషోర్ కుమార్ అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిషోర్ కుమార్ మాట్లాడుతూ సూర్యుని నుంచి వెలువడే అతి నీలలోహిత కిరణాల నుంచి భూమిపై ఉన్న సకల జీవరాసులను ఓజోన్ పొర కాపాడుతుందన్నారు. ఓజోన్ పొరను దెబ్బ తీస్తున్న కారనాలను ప్రజలకు వివరించి, నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఓజోన్‌పొర లేకుంటే మానవులకు చర్మ, కంటి సమస్యలతో పాటు మానసిక వైకల్యం, కేన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుభాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, వీరేశం, అసోసియేషన్ ప్రతినిధులు శివరామకృష్ణ, విష్ణు ప్రసాద్, అమ్మయ్య చౌదరి, జనార్ధన్ పాల్గొన్నారు.

ముగ్గురు ఆకతాయిల అరెస్ట్

మియాపూర్: మద్యం సేవిస్తూ మద్యం సీసాలను రైలు పట్టాలపై, వచ్చిపోయే రైళ్లపై విసురుతున్న ఆకతాయిలను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ రమేష్ నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్‌లోని న్యూ - హాఫీజ్‌పేట ప్రేమ్ నగర్ కాలనీకి చెందిన సాయి తన స్నేహితుడితో బైక్‌పై ఈ నెల 14న సమీపంలోని పెద్దమ్మ తల్లి దేవాలయానికి వెళ్తుండగా దారిలో రైల్వే ట్రాక్ ప్రక్కన కొందరు యువకులు మద్యం సేవించి రైల్వే పట్టాలపై, వస్తూ, పోతున్న రైళ్లపై మద్యం సీసాలు విసురుతున్నారు. దీనిని గుర్తించిన సీహెచ్. సాయి వారిని వారించేందుకు యత్నించగా వారు దాడి చేశారు. అంతేగాక వారి వద్ద ఉన్న 1.5 గ్రాముల బంగారు గొలుసు లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శాంతినగర్‌కు చెందిన వడ్డె ప్రభుదాస్, జి. శ్రీనాథ్, పూసల వెంకటేష్ అనే యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

- చందానగర్‌లో మెదక్ ఎంపీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ పర్యటన
- రోడ్డు, నాలా విస్తరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్ మీదుగా అమీన్‌పూర్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను మంగళవారం మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ బోర్కాడే హేమంత్ సహదేవ్ రావుతో పాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులు త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ లింగంపల్లి బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ నుంచి శ్రీదేవి థియేటర్‌కు వెళ్లే మార్గ మధ్యలో నాలాను విస్తరించే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ శంకర్, శేరిలింగంపల్లి జోనల్ సిటీ ప్లానర్ శ్యామ్, చందానగర్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, ఏసీపీ నాగిరెడ్డి, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఛాప్ 2025

జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ (జీఐ)పై కళాకారులకు అవగాహన

మాదాపూర్: భారతదేశంలో జీఐ భవిష్యత్తు వారసత్వం నుంచి ప్రపంచ మార్కెట్ వరకు అభివృద్ధి చెందుతుందని హ్యాండ్‌లూమ్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ బీనా ఎం. అన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఛాప్ 2025లో భాగంగా మంగళవారం జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ (జీఐ)పై కళాకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె డిజైన్, టెక్నాలజీ చట్టం, వ్యూహాత్మక బ్రాండింగ్‌తో జీఐ క్రాఫ్ట్‌ను నకిలీల నుంచి రక్షించడం, మార్కెట్ విలువను కాపాడడం, వినియోగదారుల నమ్మకం పొందడం, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సంప్రదాయ కళల పరిరక్షణ, ప్రామాణికత, నమ్మకం, గుర్తింపు, జీఐపై చర్చించారు. చట్టపరమైన రక్షణలు, సర్టిఫికేషన్ అమలు వంటి అంశాలపై సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. నగరవాసులు గృహాలంకరణ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో రెసల్యూట్ గ్రూప్ ఫౌండర్ సుభజిత్ సాహ, టాయ్స్ నోడల్ ఆఫీసర్ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.





కళా ఉత్సవ్ పోటీల్లో రాయదుర్గం విద్యార్థుల ప్రతిభ



విజేతలతో హెచ్‌ఎం తాజ్ బాబు తదితరులు

రాయదుర్గం: జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. తుక్కుగూడలోని స్లోకా ఇంటర్నేషనల్ స్కూల్‌లో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. 12 అంశాల్లో ఈ పోటీలు జరగగా మూడు విభాగాల్లో రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. 3డీ పెయింటింగ్ విభాగంలో 9వ తరగతి విద్యార్థి గంగాసాగర్ మొదటి స్థానం, ఇండిజీనియస్ టాయ్స్ విభాగంలో 10వ తరగతి విద్యార్థి విష్ణువర్ధన్, విక్రమ్ మొదటిస్థానం, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో బాదల్‌నాయక్, సోనాలిశ్రీ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు తమ విద్యార్థులు అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న రాధాకృష్ణ యాదవ్

చందానగర్: సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడాకాలనీలో బీజేపీ సేవా పక్షం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ సేవా పక్షం కార్యశాల జిల్లా కన్వీనర్ రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర శాఖ, జిల్లా శాఖ పిలుపుమేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 02 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సేవా పక్షం డివిజన్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హైదరాబాద్ విమోచనకు, తెలంగాణ స్వాతంత్ర్యానికి ప్రాణత్యాగం చేసిన వీరుల చరిత్ర భావి తరానికి తెలియాలన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన పోరాటంతోనే తెలంగాణ భారతదేశంలో విలీనం అయిందన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, మాజీ కౌన్సిలర్ రమణయ్య, బీజేపీ జిల్లా గీతా సెల్ కన్వీనర్ రవి గౌడ్, నాయకులు సత్యనారాయణ రాజు, ప్రవీణ్ రెడ్డి, పృథ్వీ కాంత్ గౌడ్, రాజు, జగదీశ్వర్‌గౌడ్, పార్వతి, నిర్మలా, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాత్రో, శివ తదితరులు పాల్గొన్నారు.

రూ.11.50 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

వెయ్యి గజాల పార్కు స్థలంలో ఆక్రమణల తొలగింపు



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి మండలం, కొండాపూర్‌లోని మాధవాహిల్స్ ఫేజ్–2లో పార్కు స్థలాన్ని హైడ్రా మంగళవారం కాపాడింది. వెయ్యి గజాల పార్కు స్థలంలో స్థానికులు గోడలు కట్టి షెడ్డులు వేశారంటూ హైడ్రా ప్రజావాణిలో మాధవహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అధికారులు పార్కు స్థలంగా నిర్ధారిస్తూ హైడ్రా అధికారులకు సమాచారం అందించారు. దీంతో హైడ్రా సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. సదరు పార్కు స్థలం విలువ దాదాపు రూ.11.50 కోట్లు ఉంటుందని అంచనా. పార్కును కాపాడినట్లు పేర్కొంటూ హైడ్రా అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నెలలు నిండని శిశువుకు అత్యాధునిక శస్త్ర చికిత్స

గచ్చిబౌలి కిమ్స్ ఆస్పత్రి వైద్యుల ఘనత



రాయదుర్గం: నెలలు నిండక ముందే పుట్టిన శిశువుకు గుండెకు సంబంధిత సమస్యతో బాధపడుతుండటంతో గచ్చిబౌలి కిమ్స్ వైద్య బృందం అత్యాధునిక పద్ధతిలో శస్త్రచికిత్స అవసరం లేకుండా నయం చేసి ప్రాణం పోశారు. ఇందుకు సంబంధించి గచ్చిబౌలి కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ నియోనాటాజిస్ట్ డాక్టర్ భవాని దీప్తి, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుదీప్‌వర్మ మంగళవారం వివరాలు వెల్లడించారు. టోలిచౌకి చెందిన దంపతులకు నెలలు నిండకముందే ఏడు నెలలకే బాబు పుట్టాడు, దీంతో అతడిని 97 రోజుల పాటు ఎన్‌ఐసీయూలో ఉంచాల్సి వచ్చింది. ఆ సమయంలో ఊపిరితిత్తుల నుంచి రక్తం రావడం, గుండె సంబంధించిన పీడీఏ సమస్య వల్ల వెంటిలేటర్ అవసరం ఏర్పడింది. తల్లి కడుపులో బిడ్డ ఉన్నప్పుడు ఊపిరితిత్తులకు మిగిలిన శరీరానికి రక్త సరఫరా చేసే రక్తనాళాలకు మధ్య ఒక గొట్టం లాంటిది ఉంటుంది. పుట్టిన 7 నుంచి 10 రోజుల్లో అది మూసుకుపోతుంది. కానీ నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు అది మూసుకోవడం కష్టం అవుతుంది., దీనినే పీడీఏ అంటారు. సదరు చిన్నారి అతి తక్కువ బరువు ఉండడం, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉండడంతో శస్త్రచికిత్స చేయడం అంత సురక్షితం కాదని భావించిన వైద్యులు అత్యాధునిక పరికరంతో ఆ రంధ్రాన్ని మూసేయాలని నిర్ణయించారు. సర్జరీ సమయానికి అతడి బరువు కేవలం 600 గ్రాములు మాత్రమే కావడంతో పికోలో అనే అత్యాధునిక పరికరాన్ని కాలి నరకం ద్వారా లోపలికి పంపి దాని సాయంతో రంధ్రాన్ని మూసివేశారు. ఈ డివైస్ అమర్చి కోలుకున్న శిశువుల్లో దేశంలోనే అతి తక్కువ బరువు గల చిన్నారిగా అతను రికార్డు సృష్టించినట్లు తెలిపారు. దీంతో రంధ్రం పూడుకుపోయి, బాబు ఆరోగ్యం మెరుగుపడినట్లు తెలిపారు. ప్రస్తుతం అతను పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని 2.45 కిలోలకు బరువు పెరగడంతో డిశ్చార్జి చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు.